# వైద్యాలయాలు వ్యాపారకేంద్రాలు కాకూడదు

సకల విద్యలు నేర్చి సభ జయించగవచ్చు
శూరుడై రణమున పోరవచ్చు
రాజరాజై పుట్టి రాజ్యమేలగవచ్చు
హేమభూదానముల్ యీయవచ్చు
గగనంపు చుక్కలు గణించియింపగావచ్చు
జీవరాసుల పేర్లు చెప్పవచ్చు
అష్టాంగవిద్యలనన్ని నేర్వగవచ్చు
చంద్రమండలయాత్ర సలుపవచ్చు
కాని దేహేంద్రియాదుల కట్టిపెట్టి
మనసు నిల్పియు నంతర్ముఖము చేసి
అనవరత నిశ్చలంబైన ఆత్మలగుచు
నిలువగాలేరు మానవుల్ నియతితోడ.

పరమ పావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నింటను వన్నెగాంచినయట్టి
ఘనసత్యశీలమే కఠిన తపము
మధుర భావంబేది మన దేశమందన్న
మాతృభావము కంటె మాన్యమెద్ది
ప్రాణంబు కంటెను మానంబె ఘనమను
మన దేశ నీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి
ఔర! ఏమందు భరత పాలనంబు
ఏనుగెట్టుల తన బలమెరుగలేదొ
అట్టులైనారు భారతీయులు నేడు.

***ప్రేమస్వరూపులారా!*** మానవుడు తన పరిపూర్ణత్వమును గుర్తించే నిమిత్తం అనేక ప్రయత్నములు సల్పుతున్నాడు. తన సంస్కృతిని, పవిత్రతను, శీలసంపత్తిని కాపాడుకొనే నిమిత్తం మానవుడు అనేక పవిత్రకార్యములలో పాల్గొనవలసివస్తుంది. మానవునికి ఉండవలసిన ప్రధానమైన గుణము ప్రేమయే. కాని,

మానవుడు ప్రేమను కోల్పోయి దంబము, అసూయ, ద్వేషము ఇత్యాది పైశాచిక ప్రవృత్తులకు లోబడి తన జీవితాన్ని దుర్వినియోగపరచుకుంటున్నాడు. *"జాతి గౌరవంబు నీతిపై నిలుచును. నీతి లేకయున్న జాతి చెడును."* మానవుడు మానవునిగా బ్రతకవలెనన్న తన హృదయంలో నీతి అనే జ్యోతిని వెలిగించుకోవాలి. నీతియే మానవునికి ఆరోగ్యాన్ని, ఆనందాన్ని చేకూర్చుతుంది. మానవత్వానికి పాంచభౌతికమైన దేహమొకటే ప్రధానం కాదు. మనస్సు, ఆత్మ అనేవి ప్రత్యేకంగా ఉన్నాయి. మానవత్వమనేది మనస్సు, బుద్ధి, సంస్కారములనే మూడు అంశములతో కూడినది. ఈ మూడూ ఆత్మయొక్క అంశములే. దీనిని పురస్కరించుకొనియే భగవద్గీత "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" అన్నది. మనస్సు ఆత్మయొక్క అంశమే. మనస్సనగా కేవలం bundle of desires అని భావించకూడదు. భౌతికమైన దృష్టిలో దీనిని bundle of desires అని చెప్పవచ్చును. కాని, ఆత్మదృష్టిలో ఇది bundle of divinity.

**ఏకత్వంలోనే ఆనందమున్నది**

'డివినిటీ'ని పొందాలంటే మానవుడు మొట్టమొదట 'యూనిటీ'ని సాధించాలి. ఐకమత్యమే మానవసంస్కృతి. ఐకమత్యంచేత ఎంతటి ఘనకార్యమునైనా సాధించవచ్చును. ఈనాటి మానవుడు స్వాతంత్ర్యమును సాధించాడుగాని, ఐకమత్యమును సాధించలేదు. 'యూనిటీ' ఉన్నచోటే 'ప్యూరిటీ' ఉంటుంది. 'ప్యూరిటీ'నుండి 'డివినిటీ' లభిస్తుంది. 'డివినిటీ' ద్వారానే ఆనందం ప్రాప్తిస్తుంది. భిన్నత్వంలో ఆనందం చిక్కదు. ఆరోగ్యమే మహాభాగ్యమని అంటారు. నిజమే. ఐతే, ఆనందాన్ని సాధిస్తే ఆరోగ్యాన్ని క్షణంలో పొందవచ్చును. ధనమునుండి, అధికారమునుండి ఆనందము లభిస్తుందనుకోవడం పొరపాటు. అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించినప్పుడే ఆనందము లభిస్తుంది. ఇట్టి ఆనందాన్ని పొందలేకపోయినప్పుడు ఎన్ని హాస్పిటల్స్ కట్టించినా, ఎన్ని సేవలు చేసినా అన్నీ వ్యర్థమైపోతాయి.

**ధనంకోసం ఆసుపత్రులను నిర్మించడం తప్పు**

నేనీ ఆసుపత్రిని కర్ణాటక ప్రజలకోసం కట్టించానని కొంతమంది భావిస్తున్నారు. కాని, నేను వారికోసం, వీరికోసం కట్టించలేదు; దేశంకోసం కట్టించాను. ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు అందరూ ఐకమత్యంగా ఉండాలి. మన ఆసుపత్రి అందిస్తున్న ఆదర్శం ఇదే. ఇట్టి ఐకమత్యంవల్లనే ఈ ఆసుపత్రి ఇంతటి ఉన్నతస్థితికి వచ్చింది. మా ఆసుపత్రి ధనముకోసం, పేరుప్రతిష్ఠలకోసం ప్రాకులాడటం లేదు. ప్రాచీనకాలములో భారతదేశంలో విద్య, వైద్యము, జలము ఉచితంగా లభించేవి. ఇప్పుడు కూడా ఈ మూడింటినీ ఉచితంగా అందించాలని నేను సంకల్పించు కున్నాను. మన హాస్పిటల్ 'బిజినెస్ సెంటర్' కాదు. ఈనాడు ప్రపంచంలో ఎక్కడ చూసినా ఆసుపత్రులు 'బిజినెస్ సెంటర్లు'గా మారిపోతున్నాయి. ఇంతకంటే పాపం మరొకటి లేదు. అనారోగ్యంతో పీడింపబడే వ్యక్తులకు ఉచితంగా ఔషధమును అందించాలి. వారినుండి ధనమును ఏమాత్రం ఆశించకూడదు. ధనంకోసం ఆసుపత్రులను నిర్మించడం చాలా తప్పు. ఇక్కడ నేనీ ఆసుపత్రిని నెలకొల్పడంచేత అనేకమంది డాక్టర్లకు నాపై అసూయ ఎక్కువైపోయింది. అసూయతో అనేక రకములైన ఇబ్బందుల్ని కల్గజేస్తున్నారు. అయినప్పటికీ నేనీ పవిత్రమైన కార్యాన్ని మానుకోను. వారి అసూయవల్ల నాకు వచ్చే నష్టమేమీ లేదు. అది నా ఉత్సాహమును మరింత అభివృద్ధి గావిస్తున్నది. ఎవరి అసూయ వారినే నాశనం గావిస్తుంది. అసూయ, అనసూయ అక్కచెల్లెళ్ళు. అనసూయకు ముగ్గురు కొడుకులు. వారే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. అసూయకుకూడా ముగ్గురు కొడుకులు. వారే కామ, క్రోధ, ద్వేషములు. ఎక్కడ అసూయ ఉంటుందో అక్కడ ఈ దుర్గుణాలు ప్రారంభమౌతాయి. అసూయ లేనివారు త్రిమూర్తుల అనుగ్రహానికి పాత్రులౌతారు.

### మంచికార్యాలకు ప్రకృతి కూడా సహకరిస్తుంది

మంచికార్యాలలో పాల్గొనాలి. మంచిపనులు చేసేవారికి తగిన ఉత్సాహప్రోత్సాహాల నందించాలి. నేనిట్టి పవిత్రమైన కార్యాలలో ఎప్పుడూ వెనుకంజ వేయను. చాలామంది బీదలు, దిక్కులేనివారు అనారోగ్యంతో పీడింపబడుతున్నారు. పెద్దపెద్ద ఆసుపత్రులలో వారిని పట్టించుకునే నాథుడు లేడు. కొన్ని ఆసుపత్రులలో వారిని గేటు దగ్గరకుకూడా రానివ్వరు. ఇంతకంటే పాపం మరొకటుందా? అలాంటివారికి ఉచితంగా వైద్య సహాయం అందించాలని నా ఉద్దేశ్యం. ఇంతేకాదు. ఆరోగ్యానికి పరిశుద్ధమైన జలము చాలా అవసరం. నా ప్లాను చాలా పెద్దదిగా రూపొందుతున్నది. నా సంకల్పము తప్పక సిద్ధిస్తుంది. మన భారతదేశంలో మంచికార్యానికి పూనుకుంటే దేనికీ కొరత లేదు. కాని, మంచికార్యానికి పూనుకునే వ్యక్తులే కనిపించడం లేదు. మంచికార్యానికి పూనుకుంటే ప్రకృతి కూడా తప్పక సహాయం చేస్తుంది. సీతాన్వేషణలో రామునికి ప్రకృతి ఎంతగానో సహాయం చేసింది. కోతులు సహాయం చేశాయి. ఒక ఉడతకూడా తనకు చేతనైన సహకారం అందించింది. కనుక, మంచి పనులను చేయడానికి మీరు నిరంతరం సిద్ధంగా ఉండాలి. రేపటికి వాయిదా వేయకూడదు.

### మద్రాసుకు మంచినీటి పథకం

ఈ పవిత్ర సమయంలో నేను మరొకటి సంకల్పించుకున్నాను. మద్రాసులోని ప్రజలు త్రాగునీటి సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నారు. ధనవంతులు లారీలపైన, బండ్లపైన నీరు తెప్పించుకొని త్రాగగల్గుతున్నారు. కాని, బీదలు చిన్నచిన్న గుంటల్లోని కలుషితమైన నీటిని త్రాగి ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. కృష్ణా, గోదావరీ జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోతున్నాయి. కాబట్టి, ఎంత కష్టమైనా సరే, ఎంత నష్టమైనా సరే, నేను మద్రాసుకు మంచినీరు అందించాలని సంకల్పించుకుంటున్నాను. ఇంతేకాదు. రాయలసీమకూడా త్రాగునీటి సమస్యతో సతమత మౌతున్నది. బళ్ళారి, అనంతపురం, కడప, కర్నూలు (ఠellary, ˛nanthapur, ఇuddapah, kurnool) ఈ నాల్గింటికీ ఏఞward districts (వెనుకబడిన జిల్లాలు) అని పేరు. ఈ నాల్గు జిల్లాలకు పరిశుభ్రమైన నీటిని అందించాలని ఆశిస్తున్నాను. ఇది తప్పక నెరవేరుతుంది, సందేహం లేదు.
మానవుడు దృఢమైన విశ్వాసమును అభివృద్ధిపరచుకోవాలి. కాని, ఈనాటి మానవునికి విశ్వాసమనేదే లేదు. తనపైనే తనకు నమ్మకం లేదు. ఇంక, దైవాన్ని ఏరీతిగా నమ్మగలడు? "నమ్మకమను రెండు నయనమ్ములే లేని అంధులైరి జనులు అవనియందు." విశ్వాసం లేకపోతే మానవత్వం ఏరీతిగా వికసించగలదు? మానవుడనగా విశ్వాసం కల్గినవాడని అర్థం. నరజన్మ దుర్లభమైనది. కాబట్టి, దీనిని దుర్వినియోగపరచక పరోపకార సంబంధమైన పనులలో పాల్గొని సార్థకం గావించుకోండి.

### ఇంద్రియాల సద్వినియోగంవల్లనే ఆరోగ్యం, ఆనందం

హస్తము లిచ్చినదెందుకొ తెలుసా? నోటికి ముద్దందించుటకా? కాదు, కాదు. పరోపకారసంబంధమైన పనుల నాచరించేటందులకు. నోటిని ఇచ్చినదెందుకొ తెలుసా? మాటలు పలికేటందులకా? కాదు, కాదు. ఆర్తావనుడౌ దేవదేవుని కీర్తనలు పాడేటందులకు. ఈరీతిగా, భగవంతుడు ప్రసాదించిన పంచేంద్రియాలను సక్రమమైన మార్గంలో వినియోగించాలి. బుద్ధుడు చేసిన సాధన ఇదే. అనేక గ్రంథాలు చదివాడు, ఎందరో పెద్దలను దర్శించి వారి ప్రసంగాలను విన్నాడు. చివరికి, భగవంతుడు ప్రసాదించిన పంచేంద్రియాలను సద్వినియోగం చేయకుండా ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదని గుర్తించాడు. కన్నులతో మంచి దృశ్యాలను చూడాలి. చేతులతో మంచిపనులు చేయాలి. నోటితో మంచిపలుకులు పలకాలి. చెవులతో మంచి విషయాలను వినాలి. మనస్సులో మంచితలంపులను నింపుకోవాలి. ఇదే దైవసన్నిధికి రాజమార్గం. మీ పంచేంద్రియాలను

పవిత్రం గావించుకునే నిమిత్తం పరోపకార సంబంధమైన పనులలో పాల్గొనాలి. "యద్భావం తద్భవతి." మీ మనస్సులోని భావాలు చెడ్డవిగా ఉంటే మీకు లభించే ఫలితం కూడా అలాగే ఉంటుంది. తోటివారికి సహాయం చేయడానికి మీకు శక్తి లేకపోతే కనీసం మంచిపలుకులైనా పలకండి. మీ పలుకులు మనిషిని హింసించేవిగా, హృదయాన్ని నొప్పించేవిగా ఉంటే మీకు ఆరోగ్యం, ఆనందం ఎలా కల్గుతాయి? మీరు సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందాలనుకుంటే మీ ఇంద్రియాలను పవిత్రమైన మార్గంలో ప్రవేశపెట్టండి. ధనము కొందరివద్ద ఉండవచ్చు, కొందరివద్ద లేకపోవచ్చు. కాని, భగవంతుడందరికీ పంచేంద్రియాలను ప్రసాదించాడు. వాటిని సద్వినియోగపరచుకోండి. అప్పుడే మీ జీవితం సార్థకమౌతుంది.

**సంపాదనలో సగభాగం దానధర్మాలకు...**

ప్రతి మానవునియందు హృదయమున్నది. దయతో కూడినదే హృదయం. కాని, మానవుడు తన హృదయంలో కరుణను నింపుకో వలసిందిపోయి కాఠిన్యాన్ని నింపుకుంటున్నాడు. మానవుడు జన్మతః దుర్గుణుడు కాడు, దురాచారసంపన్నుడు కాడు. సద్గుణములు, సత్ప్రవర్తన కల్గినవాడే మానవుడు. కనుకనే, "జంతూనాం నరజన్మదుర్లభం" అన్నారు. కాని, నిరంతరం అన్యాయ, అక్రమ, అనాచారములలో మునిగియుంటే ఇంక నరజన్మ దుర్లభమని చెప్పడంలో అర్థమేమున్నది? మీ చదువును, ధనమును పదిమందికి పంచి సార్థకం గావించుకోవాలి. డబ్బు ఉండవలసిందే. కాని, అదే సర్వస్వమని భావించి దానికోసం ప్రాకులాడ కూడదు. కొందరు కోట్లు ఖర్చుపెట్టి ఆసుపత్రిని నిర్మిస్తారు కాని, దానినుండి మరెన్నో కోట్ల ఆదాయం ఆశిస్తారు. ఇది చాలా పొరపాటు. సంపాదనలో సగభాగం దానధర్మాలకు వినియోగించాలి. కాని, డాక్టర్లు ఒక్క పేషంటుకైనా ఉచితంగా మందు లివ్వడం లేదు. మందుల ఖరీదుకూడా చాలా పెరిగిపోయింది.

**"త్యాగేనైకే అమృతత్వ మానశుః"**

పుట్టపర్తిలో హాస్పిటల్ కట్టి పది సంవత్సరాలైంది. మీరు నమ్ముతారో నమ్మరోగాని 70 వేల మందికి ఉచితంగా ఆపరేషన్లు చేశాము. ఇప్పుడు ఇక్కడ హాస్పిటల్‌ను ప్రారంభించి ఒక సంవత్సరం పూర్తయింది. ఇక్కడకూడా వేలాది ఆపరేషన్లు జరిపినాము. వీటి నిమిత్తం నెలకు అనేక కోట్ల రూపాయలు ఖర్చు అవుతోంది. చాలామందికి ఈవిషయం తెలియదు. అయితే, ఎన్ని కోట్లు ఖర్చు అయినా నేనీ పవిత్రకార్యాన్ని వదలిపెట్టను. ఆరోగ్యమే మహాభాగ్యం. ఆరోగ్యంబాగున్నప్పుడు మానవుడు దేనినైనా సాధించగలడు. కనుక, రోగులను చేర్చుకొని వారికి ఆరోగ్యాన్ని చేకూర్చడం మా కర్తవ్యంగా భావిస్తున్నాము, ప్రేమపూర్వకంగా సేవ చేస్తున్నాము. ఇందులో ఒకరి ప్రోద్బలంగాని, 'ఫోర్సు'గాని ఏమాత్రం లేదు. ఇది ప్రేమ అనే 'సోర్సు' నుండి ఏర్పడినది. ఈ హాస్పిటల్ ఇంకా అభివృద్ధి చెంది బీదలకు తగిన సహాయం చేయాలని నేను ఆశిస్తున్నాను. మన కర్ణాటక ముఖ్యమంత్రి కృష్ణగారు దీనికి కావలసిన భూమి నిచ్చి ఎంతో సహాయం చేశారు. ఆయన హృదయం పవిత్రమైన త్యాగ భావంతో నిండియుంది. "త్యాగేనైకే అమృతత్వ మానశుః", త్యాగమే అమృతత్వాన్ని చేకూర్చుతుంది. ఈరోజు ఇక్కడికి వచ్చిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఇలాంటి హాస్పిటల్‌ను బొంబాయిలో కూడా కట్టించ వలసిందని కోరుతున్నాడు. దానికి కావలసిన భూమిని ఇస్తామని అంటున్నాడు. బొంబాయిలో రోజురోజుకీ పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా పరిణమిస్తోంది.

**పాపపుణ్యాలే చివరికి మీ వెంట వస్తాయి**

ప్రేమస్వరూపులారా! మీరు మానవులై పుట్టినది ధనమును కూడబెట్టుకోవడానికి కాదు. పోయే సమయంలో ఒక్క నయాపైస అయినా మీవెంట తీసుకువెళ్లగల్గుతున్నారా? పిడికెడు మట్టినికూడా తీసుకు పోవడానికి

వీలుకాదు. నిజంగా మీరు పోయే సమయంలో పిడికెడు మట్టినైనా తీసుకువెళ్ళగల్గి ఉంటే, ఈపాటికి మట్టికికూడా రేషన్ ఏర్పడేది! పాపపుణ్యాలు రెండే చివరికి మీవెంట వస్తాయి. కనుక, పాపానికి పాల్పడకుండా పుణ్యాన్ని ప్రోగుచేసుకోండి. 'పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం.' చేతనైనంతవరకు సహాయం చెయ్యండి. ఎవ్వరినీ బాధించకండి. మీ శక్తికొలదీ దానధర్మాలను ఆచరించండి. హృదయంలో ప్రేమను నింపుకోండి. అప్పుడు మీ జీవితమంతా ప్రేమమయంగా రూపొందుతుంది.

**అసూయ, క్రోధములే అసలైన 'టెర్రరిస్టులు'**

అమెరికా ప్రెసిడెంటు టెర్రరిస్టులను అంత మొందించాలని అన్నాడు. అసలు టెర్రరిస్టులు ఎవరు? అసూయ, క్రోధములనే టెర్రరిస్టులు ప్రతి మానవునియందున్నారు. కనుక, మానవుడు మొట్టమొదట తనయందున్న ఈ 'టెర్రరిస్టుల'ను చంపివేయాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. ఈనాడు అసూయను, క్రోధాన్ని చంపకుండా మనుష్యులను చంపుతున్నారు. మీలో ఉన్న దుర్గుణాలనే టెర్రరిస్టులను మీరే చంపుకోవాలి. సద్గుణాలను పోషించుకోవాలి. ఇదే నేను కోరేది. నా హృదయంలో ఉన్నదంతా ప్రేమయే, ప్రేమయే. నా ప్రేమను నేను అందరికీ పంచుతున్నాను. అందరూ నావారు, నేను అందరివాడను. నేను అందరినీ ప్రేమిస్తున్నాను, అందరూ నన్ను ప్రేమిస్తున్నారు. ప్రేమయే మన మధ్య ఉన్న సన్నిహిత సంబంధము.

ఈరోజు ఈ ఆసుపత్రి వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాము. కాని, నాకీ ఉత్సవాలపట్ల అంత ఆసక్తి లేదు. మీరు ప్రేమను, దయను పెంచుకోవడమే నాకు కావలసింది. మీరు ప్రేమమయమైన జీవితాన్ని గడుపుతూ, భారతదేశాన్ని ఆదర్శవంతంగా రూపొందింప జేస్తారని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

(2002 జనవరి 19వ తేదీ ఉదయం శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (వైట్‌ఫీల్డ్)లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)